

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

### కౌన్ హో తుం, కౌన్ హో...

కొన్ని సినీగీతాలు వింటూంటే, ఎంత గొప్ప సృజనాత్మక కళాకారులు మన సినీ కళాకారులు అన్న ఆశ్చర్యంతోపాటు గర్వం, గౌరవం కూడా కలుగుతుతాయి. పలు కారణాల వల్ల మన సినీ కళాకారుల సృజనను సరైనరీతిలో మనం విశ్లేషించుకోవటం లేదనిపిస్తుంది.

తొలితరం హిందీ సినీ కళాకారులలో 'శాంతారాం' తనదైన ప్రత్యేక సినీ నిర్మాణ సంవిధానం ఏర్పరచుకున్నవాడు. సినీ మాధ్యమం ప్రభావాన్ని, సమాజంపై చూపగల దీర్ఘకాలిక ప్రభావాన్ని, శక్తినీ సంపూర్ణంగా ఆకళింపు చేసుకున్న అరుదైన కళాకారుడు శాంతారం. ముఖ్యంగా, దృశ్య మాధ్యమం అయిన సినిమాలో సంగీత సాహిత్య ప్రాధాన్యాన్ని గుర్తించిన తొలితరం కళాకారులలో అగ్రగణ్యుడు శాంతారం. అందుకే శాంతరాం సినిమాలన్నిటిలో సంగీతం అత్యుత్తమ స్థాయిలో ఉంటుంది. సాహిత్యం అత్యున్నతంగా ఉంటుంది. ముఖ్యంగా, శాంతారాం జాతీయ భావాలకు పెద్ద పీట వేసే వ్యక్తి కావటంతో, ఆయన సినిమా పాటలలో శుద్ధ హిందీ వాడకం అధికంగా కనిపిస్తుంది. ఉర్దూ పదజాలం అతి తక్కువగా వినిపిస్తుంది. తన సినిమాలలో అత్యుత్తమ హిందీ సాహిత్యాన్ని ప్రతిబింబించేందుకు ఆయన ఎన్నుకున్న గేయ రచయిత భరత్‌వ్యాస్. భరత్‌వ్యాస్ హిందీ పాండిత్య లోతుకు, గేయ రచనా నైపుణ్యానికి శాంతారాం సినిమాలలో పాటలు తిరుగులేని దృష్టాంతాలుగా నిలుస్తాయి.

శాంతారాంకు అత్యంత ప్రీతిపాత్రమయిన కథ 'శకుంతల కథ'. 1943లో ఒక 'శకుంతల'ను రూపొందించాడు శాంతారాం. మళ్లీ 1961లో ఇంకో శకుంతలను 'స్త్రీ' అనే సినిమాగా నిర్మించాడు. శాంతారాం సినిమాలలో స్త్రీ పాత్రలు అత్యంత శక్తివంతమైనవి, ఆత్మాభిమానం, ఆత్మగౌరవం అధికంగా కలవిగా రూపొందటం వెనుక ఆయనకు 'శకుంతల' గాథ పట్ల ఉన్న మక్కువ ప్రధాన పాత్ర పోషించిందంటారు. 'గీతగాయా పథ్థరోంనే' సినిమా ఆధునిక శకుంతల కథలాంటిది. నవరంగ్, బూంద్ జో బన్‌గయి మోతి, జల్ బిన్ మఛ్‌లీ నృత్య బిన్ బిజిలీ వంటి వన్నీ 'శకుంతల' కథకు మరో రూపంలాంటి కథలే.

'శకుంతల' లాంటి అత్యుత్తమ కథ ప్రభావం వల్ల సినిమాలు రూపొందించటం వల్ల కాబోలు శాంతారాం సినిమాలలో స్త్రీ పాత్రలు అత్యంత శక్తిమంతమై, ఆత్మ గౌరవం, ఆత్మవిశ్వాసాలు ఉట్టిపడుతూంటాయి. అలాంటి నాయికలను వర్ణించే గీతాలు అత్యుత్తమ వర్ణనలతో, ఉన్నతమైన భాషకాలవాలమై ఉండటంలో ఆశ్చర్యంలేదు.

'స్త్రీ' సినిమాలో భరత్ వ్యాస్ రచించగా, సి.రామచంద్ర సంగీత దర్శకత్వం వహించిన 'కౌన్ హో తుం' పాట 'శాంతారాం' సినిమాలలోని 'స్త్రీ' వర్ణన గీతాల అత్యుత్తమ స్థాయికి చక్కటి నిదర్శనం. పాట పల్లవి ఒక ప్రశ్న వాక్యం. 'కౌన్ హో తుం, కౌన్‌హో ... 'నువ్వెవరు?' ఇదీ ప్రశ్న నాయకుడికి.

**'ఎవరు నీవు? నీ రూపమేది? ఏమని పిలిచేది? నిన్నేమని పిలిచేది?'**

సుశీల ఘంటసాలలు 'ప్రేమలు, పెళ్లిళ్లు' సినిమాలో ఎమ్మెస్ విశ్వనాధన్ సంగీత దర్శకత్వంలో పాడిన డాక్టర్ సి.నారాయణరెడ్డి గీతం ఇది. అయితే ఈ పాటలో నాయకుడి ప్రశ్న వేరు, 'స్త్రీ' సినిమాలో నాయకుడు వేసిన ప్రశ్న ధోరణి వేరు.

**కవికీ మధుర్ కల్పనా హో తుం**

**యా గాయక్ కే మధురిమ తాన్**

**యా సరితా జల్‌కీ తరంగ్ హో**

**అరుణ్ కమల్‌కే మధు ముస్కాన్**

**కౌన్ హో తుం, కౌన్ హో**

కవి మధుర కల్పనవో, గాయకుడి మధురమయమైన రాగానివో, శుభ్ర స్రవంతీ జల తరంగానివో, అరుణ వికసిత కమలపు సుందర మందహాసానివో, ఎవరు నీవు, ఎవరివో? అంటున్నాడు కవి. ఈ పాటను సి.రామచంద్ర పాటలోని పదాలు ఎంత స్వచ్ఛమూ, ఉత్తమమైనవో అంత మధురము, మృదువైన రీతిలో రూపొందించాడు. మహేంద్ర కపూర్ పాడిన అత్యంత మధురమూ, అర్థవంతమైన పాటలలో ఈ పాట అగ్రస్థానంలో ఉంటుంది.

**ఋత్ బసంత్‌కే ప్రథం కలీహో**

సావన్ కీ పహేలీ బర్సాత్

యా చిర విరహీ దో హృదయోంకే

మధుర మిలన్ కే పహలీ రాత్

కౌన్ హో తుం కౌన్ హో...

ఎంతో గొప్పగా, మధురంగా అనిపిస్తూ హృదయాన్ని మధుర భావనా తరంగాలతో ఆనందమయం చేస్తాయి పాటలోని పదాలు, పదాలు కలిగించే భావాలు, వసంత ఋతువులోని ప్రధమ మొగ్గట ఆమె. ఈ వర్ణననే అద్భుతంగా ఉంటుంది. మానవ జీవితంలో 'ప్రధమం' అన్నిటికన్నా ప్రధమ స్థానం వహిస్తుంది. 'తొలి' అన్నది మానవజీవితంలో ప్రత్యేక స్థానం ఆక్రమిస్తుంది, తొలి పుట్టినరోజు, ప్రధమ పరిచయం, ఇలా.. ప్రతి 'ప్రధమ'ను మనిషి ఆనందంగా సంబరాలు చేసుకుంటూ అనుభవిస్తాడు. అందుకే వసంత ఋతువులో పూచిన తొలి 'పుష్పం' అని ఆమెను భావించటం అంటే అంత 'అద్భుతం' ఆమె అని అర్ధం. నిజానికి 'కలి' అంటే 'మొగ్గ' అని అర్ధం. అంటే 'తొలి పూత' అన్నమాట. ఇది ఇంకా అపురూపం. వర్ష ఋతువులో తొలి వర్షం ఆమె. ఎండలకు విసిగి, వర్షపు చినుకుకోసం ఆత్రంగా ఎదురు చూసే హృదయాలకు తొలి వర్షం కలిగించే ఆనందం వర్ణనాతీతం. అలాంటి ఆనందం ఆమె. లేక, ఎంతోకాలం విరహంతో తపిస్తున్న రెండు హృదయాల కలయిక ప్రధమ రాత్రి ఏమో ఆమె.. ఎవరు నువ్వు? నువ్వెవరు? అంటున్నాడు నాయకుడు. నాయికను ఇంత సంస్కారవంతంగా, ఎంత అత్యున్నతంగా, అత్యుత్తమంగా వర్ణించాడో కవి. ఆ సంస్కారానికి, స్త్రీ పట్ల ఉన్న ఒక దివ్య భావనకు జోహార్లు అర్పించాలనిపిస్తుంది. 'స్త్రీ' అంటే శరీరం, కోరికలు మాత్రమే అంటూ ఒక ఉన్నత స్థానంలో ఉన్న స్త్రీని లాగి నడిబజారులో కేవలం శరీరావయవాల్లా నిలిపిన ఆధునిక స్త్రీ విమోచనోద్యమాలు సాధించిన 'ప్రగతి' లోని వికృతిని స్పష్టం చేస్తాయి ఇలాంటి ఉన్నత భావనల కవితలు. ఇప్పుడిలా వర్ణిస్తే స్త్రీయే ఆమోదించని పరిస్థితులు కల్పించారు.

ప్రణయ్ గీత్‌కీ ప్రధం పంక్తిహో, యా మనుకీ పహలీ సంతాన్

నవయవ్వన్‌కీ ప్రథం దృష్టిహో, నయనోంకె పహలీ పహచాన్

కౌన్ హో తుమ్, కౌన్‌హో...

హృదయం ఉప్పొంగుతుంది. 'నవ్వినా ఏడ్చినా కన్నీళ్లే వస్తాయి' అన్నట్టు ఇంత మధుర భావన భరించలేనట్టు కళ్లల్లో నీళ్లు ఉబికి వస్తాయి. భరించలేని ఆనందం కన్నీళ్ల రూపం ధరిస్తుంది. ఎప్పుడయితే, పాత్రలో నీరు నిండిపోతుందో, అప్పుడు నీళ్లు పొంగి పొర్లుతాయి. అలాగే, హృదయంలో భరించలేని ఆనందం కలిగినప్పుడు ఆ ఆనందం కన్నీళ్ల రూపంలో పొంగి పొర్లుతుంది. చివరి చరణంలో ప్రతి పదం, ప్రతి భావం, ప్రతి వర్ణన భరించలేని ఆనందం కలిగిస్తుంది. అలవికాని తీవ్రమైన తపనను రగిలిస్తుంది .ఎలాంటి కళాకారులు వారు, స్త్రీని ఇంత అతి సమ్మోహనకరంగా, అత్యుత్తమ స్థాయిలో, హిమాలయ శృంగంపై నిలిపి తీవ్రమైన భక్తి భావనతో వర్ణించగలిగారు? అన్న ఆలోచన కలుగుతుంది.

హిమాలయ శిఖరంపై అత్యున్నత స్థాయిలో నిలిచిన మంచు కరగి, కొండపైనుండి క్రిందికి ప్రాకి, భూమిపై ప్రవహించి బురద గుంటలో కలసినట్టు ఇప్పటి సినిమాల్లో స్త్రీ వర్ణన గుర్తుకు వచ్చి మనసు అత్యంత ఆనందంలోనూ అంతులేని బాధను అనుభవిస్తుంది.

**పహన్ కె జోడా లాల్ కలర్ కా**

**తూనె మచాయా ఖూబ్ తహెల్కా**

**బై గాడ్ తూ లగ్తీ హై జైసే**

**స్విమ్మింగ్ పూల్‌మే ఫూల్ కమల్‌కా..**

.ఇటీవలె విడుదలైన 'తూ ఝూటీ మై మక్కార్' అనే సినిమాలో సూపర్ హిట్ పాట ఇది. నాయకుడు నాయికను వర్ణిస్తున్నాడు. ఆమె ఎర్రరంగు దుస్తుల్లో సంచలనం సృష్టిస్తోందట. దేవుడిమీద ఒట్టువేసి చెప్తున్నాడు. ఆమె స్విమ్మింగ్ పూల్‌లో కమలంలా ఉందట. 'కమలం' బురదలో వెల్లివిరుస్తుంది. దాని వ్రేళ్లు బురదలో బలంగా పాతుకుంటాయి. స్విమ్మింగ్ పూల్‌లో కమలంలా ఉందట! పదాలు బాణీలో వొదిగితే చాలు ఔచిత్యం అనవసరం. ఇప్పుడెవరూ అనటంలేదు, నాయికను కమలంలా వుందన్నాను... కారు బంపర్ తోటో, కోకాకోలా బాటిల్ తోటో పోల్చలేదు అని వాదిస్తారు ఈనాటి గేయ రచయితలు.

'కమలం' బురదలో విరుస్తుంది. దాని వ్రేళ్లు బురదలో బలంగా పాతుకుంటాయి. స్విమ్మింగ్ పూల్‌లో విరిసిన కమలం అంటే, స్విమ్మింగ్ పూల్ ఓ బురద అయివుండాలి. రామ! రామ! ఆ మధ్య ఓ తెలుగు పాటలో హీరో హీరోయిన్లు 'బురదలో వానపాములతో' తమని తాము పోల్చుకున్నారు.

**తేరి బిందీ హై యా సెర్చ్‌లైట్ హై**

**సాడీమే లిప్టీ  డైనమైట్ హై**

అంటాడు హీరో నాయికను ఇదే పాటలో.. నీ బొట్టు సెర్చ్‌లైట్‌లాంటిది. నువ్వు చీరకట్టిన విస్ఫోటన పదార్ధానివి అంటున్నాడు. అతి గొప్ప వర్ణన. చీరకట్టిన డైనమైట్!!!!!

**తెరె బాలోమె సింటీ సావన్ కీ ఘటా**

**తెరే గాలోంపే ఛిట్‌కీ పూనం కీ ఛటా**

**తీఖే తీఖే నయన్, మీఠే మీఠే బయాన్**

**తెరే అంగోం సే చంపా కా రంగ్ చఢా**

**బడే  మన్ సే విధాతనే తుఝ్‌కో ఘడా...**

ఆమె కురులలో, వర్షఋతువునాటి దట్టమైన నల్లటి మేఘాలు ఒదిగి  పోయాయట. ఆమె బుగ్గలపై వెన్నెల కాంతి పుంజాలు భాసమానం అయ్యాయట. 'ఛిటకనా' అంటే 'చిలకరించటం' 'ప్రకాశవంతం చేయటం' అన్న అర్థాలు వస్తాయి. 'గాలాంపే ఛిట్‌కీ పూనంకీ ఛటా' అంటే ఆమె బుగ్గలపై వెన్నెల వెల్లి విరిసిందన్న అర్థమూ వస్తుంది. ఆమె బుగ్గలపై వెన్నెల నడయాడుతోంది అన్న అర్థమూ వస్తుంది. ఆమె దృక్కులు స్పష్టంగా స్వచ్ఛంగా ఉన్నాయి. ఆమె మాటలు తీయదనం చిలుకుతున్నాయి. భగవంతుడు నిన్ను మనస్ఫూర్తిగా తయారు చేశాడు అంటున్నాడు కవి నాయికను వర్ణిస్తూ. ఇది 'నవరంగ్' సినిమాలో భరత్‌వ్యాస్ రచించిన గీతం. సి. రామచంద్ర సంగీత దర్శకుడు.

'స్త్రీని ఆకాశంలో కూచోబెట్టి పూజించి అన్యాయం చేశారు. ఆమె కూడా మనిషే' అంటూ కురులలో వర్షపు మేఘాలు, బుగ్గలపై వెన్నెలలుండే నాయికను, స్విమ్మింగ్ పూల్‌లో కమలం, సెర్చ్‌లైట్ బొట్టు, బట్టకట్టిన డైనమైట్ చేసేసి ఉద్ధరించేశామని సంబరపడుతున్నారు. భరత్‌వ్యాస్ పాటలు వింటూంటే ఏ స్థాయినుంచి ఏ స్థాయికి సమాజంలో 'స్త్రీ' పట్ల అభిప్రాయం మారిందన్నది స్పష్టంగా తెలుస్తుంది. అత్యంత ఉన్నతమూ, ఉత్తమమూ, అత్యంత శ్రేష్టతరమయిన వ్యక్తిత్వమూ కలది కాబట్టే ఆనాడు నాయకులు, నాయిక ఒక్క క్షణమాత్రపు దర్శనంతో మంత్ర ముగ్ధులయి, జీవితాంతం ఆమెను స్మరిస్తూ, ఆమెను ధ్యానిస్తూ గడిపేసేవారు.

ఏక్ ఝలక్ దిఖాగయీ

బిజ్లీ గిరాగయీ

ప్యార్ బన్‌కె జిందగీ మె కౌన్ ముస్కురాగయీ

ఏక్ రూప్ కే కిరణ్

చుప్కె చుప్కె చ్ఛూలే తన్

కభీ కభీ నైననా్క

తీర్ సా చలాగయీ

కౌన్ ముస్కురా గయీ

'సుర్దార్ మాలిక్ ' సంగీత దర్శకత్వంలో భరత్ వ్యాస్ 'రూప్ సుందరీ ' సినిమాకోసం రాసిన సుందమైన గీతం ఇది. మహమ్మద్ రఫీ గానామృత స్రవంతిలోని మధురమైన బిందువులాంటిదీ పాట.

ఆమె ఒక్కసారి దర్శనం ఇచ్చిందట. దాంతో అతడిపై మెరుపులు విరుచుకుపడ్డాయి. ఆమె ప్రేమ మయి అతడి జీవితాన్ని ఆనందమయం చేసింది. సుందరమైన రూపపు కిరణాలు అతడి శరీరాన్ని స్పృశించాయి. ఆమె తీక్షణమైన కళ్ళు బాణాలు విసిరాయి. ఇంతా చేసి నవ్వుతూ వెళ్లిపోయిందెవరని అడుగుతున్నాడు గాయపడిన హృదయంతో ఆ మధురమైన అనుభవాన్ని స్మరిస్తూ నాయకుడు.

పాట వింటూంటే ఎంతో ఆనందం కలుగుతుంది. పాటలో గేయ రచయిత పదాలలో ప్రదర్శించిన చమత్కారం పెదవులపై చిరునవ్వు నిలుస్తుంది. మదిలో మధురమైన భావన కలుగుతుంది. ఒక సంస్కారవంతమూ, సున్నితమైన ప్రేమ భావన స్వరూపం అస్పష్టమైన అలలా కదులుతుంది.

కైసి అనోఖీ ములాకాత్ థీ

ఆంఖోమే తెరీ కోయీ బాత్‌థీ

బోలేబినా భేద్ సంఝా గయా

ఐసీ కరామాత్ థీ

క్యా నజర్‌సె కహగయా

హం ఖడేహి రహగయే

ఏక్ హీ పలక్ జాదూకే ఝలక్

దిఖాగయా

కౌన్ ముస్కురాగయా

ఆమెతో కలయిక అద్భుతమైనది. అపురూపమైనది. ఆమె కళ్లల్లో అలవికానిదేదో ఉంది. ఒక్క పలుకు కూడా లేకుండా ఆమె విషయాన్ని వివరించి వెళ్లిపోయింది. ఆమె కళ్లు ఏదో చెప్పి వెళ్లాయి. దాంతో అలాగే స్థాణువై నిలచిపోయాను. ఒక్క క్షణంలోనే దర్శనం ఇచ్చి మంత్రముగ్ధుడిని చేసి వెళ్లింది. అలా నవ్వుకుంటూ వెళ్లిపోయిందెవరు? ఎంతో సులువుగా, అర్థమయ్యే తేలిక పదాలను వాడినా ఎంతో లోతైన మధురమైన చమత్కార ప్రేమ భావనను కలిగిస్తాడు భరత్ వ్యాస్ తన గేయ రచనలో.

ఇలాంటి పాటలు వింటూంటేనే 'హం ఖడేహి రహగయే' అనాలనిపిస్తుంది. పాటలు వింటూంటే, భావనల సముద్రాల తరంగాలపై ఓలలాడుతూ ప్రపంచాన్ని మరచిపోయి మధురోహల మరో ప్రపంచంలో విహరిస్తాము. సినీ గీతాల ద్వారా బ్రహ్మానందానుభవపుటంచులు చేరుకుంటాము.

(వచ్చే నెల మరిన్ని భరత్ వ్యాస్ మధుర గీతాలతో..)

Click here to share your comments